అంబేద్కర్ ఒక విప్లవం

ఆయన సిద్ధాంతం విశ్వజనీయం

అంబేద్కర్ పేరిట ప్రభుత్వ అవార్డు

అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ సభలో కెసిఆర్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'అంబేద్కర్ విగ్రహం కాదు..ఒక విప్లవం, ఆయన తెలంగాణ కలల సాకార దీపిక. బాబాసాహెబ్ విశ్వమానవుడు. ఆయన సిద్ధాంతం విశ్వజనీయం. అంబేద్కర్ ఆశయాల సాధనకోసం తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది.' అని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి కెసిఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కెసిఆర్ మాట్లాడారు. సచివాలయానికి నిత్యం వచ్చి పోయే మంత్రులు, ఉన్నతాధికారుల్లో సమతా స్ఫూర్తి నింపేందుకే అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించామని ఆయన చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70 ఏళ్లు దాటినా దళితులకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీ నాయకులు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు గ్రహించాలనీ, మంచి పనులు చేసే వారిని ఆదరించాలని సూచించారు. పదేండ్లలో దళితుల అభివృద్ధి కోసం లక్షా 25వేల కోట్లు ఖర్చు చేశామనీ, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు అమలు చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రకటించిన తర్వాత మహారాష్ట్రలో మంచి ఆదరణ లభించిందని, యూపీ, బీహార్, బెంగాల్‌లో కూడా అవే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. దేశంలో రాబోయే రాజ్యం మనదేననీ, ఏటా 25లక్షల దళిత కుటుంబాలకు దళిత బంధు ఇచ్చి తీరుతామని ప్రకటించారు. ప్రజలు గెలిచే రాజకీయం రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది రాష్ట్రంలో లక్షా 25వేల దళిత కుటుంబాలకు దళిత బంధు అమలు చేస్తామని సభాముఖంగా ప్రకటించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించుకునేలా.. ప్రతిఏటా రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ అవార్డు అందజేస్తుందనిప్రకటించారు. ఇందుకోసం రూ.51కోట్లను ప్రభుత్వం డిపాజిట్ చేస్తుందనీ, ఏడాదికి వచ్చే రూ.3కోట్ల వడ్డీతో ఆ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని కెసిఆర్ తెలిపారు. ప్రసంగం ప్రారంభంలో కేసీఆర్ చేసిన జై భీం నినాదాలకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది.

దేశానికి హైదరాబాద్ రెండో రాజధాని కావాలి : ప్రకాశ్ అంబేద్కర్

దేశానికి రక్షణ పరంగా హైదరాబాద్ రెండో రాజధాని అవసరమని అంబేద్కర్ ఆనాడే చెప్పారని అది నెరవేరాలని కోరుకుంటున్నానని ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. దేశంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమవుతున్నాయనీ, మార్పు కోసం యుద్ధం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఉందన్నారు.

దీనికి కెసిఆర్ దిశా నిర్దేశం చేశారని చెప్పారు. దేశంలో మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలు మాత్రమే లేవని కుల పరమైన మైనార్టీలు కూడా ఉన్నారని చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన నిబంధన మేరకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో కార్యాచరణ మొదలు పెట్టి దేశ వ్యాప్తంగా ఉద్యమించాలని కోరారు. దేశంలో జాతీయ నాయకుడిగా చెప్పుకునే వారెవరూ లేరనీ, తెలంగాణ దేశానికి దిక్సూచిగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న దళిత బంధు గొప్ప కార్యక్రమమనీ, దాని ఫలితాలు త్వరలో కనిపిస్తాయని ప్రకాశ్ అంబేద్కర్ చెప్పారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం అమలవుతున్న పథకాలను వివరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. సిఎస్ శాంత కుమారి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రపంచంలోనే ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. అంబేద్కర్ విగ్రహం ప్రజలందరి నిత్య చైతన్య దీప్తి అని అన్నారు. సభా ప్రారంభంలో ప్రకాశ్ అంబేద్కర్‌ను సిఎం కెసిఆర్ ఘనంగా సన్మానించారు. దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(డిక్కి)కి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రెండెకరాల భూమి పట్టాను ఆ సంస్థ బాధ్యులు నర్రా రవికుమార్‌కు సిఎం అందజేశారు.'దళిత బంధు విజయగాథలు' వీడియో సీడీని ప్రకాశ్ అంబేద్కర్ ఆవిష్కరించారు.


ప్రకాశ్ అంబేద్కర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ

హుస్సేన్ సాగర్ తీరంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ మహోన్నత కాంస్య విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి కేసీఆర్ ఆవిష్కరించారు. బౌద్ధ మత గురువులు ప్రార్థనల మధ్య.. విగ్రహాన్ని నిలబెట్టిన బేస్ భవనంలో ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని మీటనొక్కి ప్రకాశ్ అంబేద్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెలీకాప్టర్ నుంచి అంబేద్కరునిపై పూల వర్షం కురిపించారు. జై భీం నినాదాలతో సాగర తీరం మారుమోగింది. కేసీఆర్, ప్రకాశ్ అంబేద్కర్, మంత్రులు, అధికారులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బేస్ భవన్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. ఎస్‌సి కార్పొరేషన్ రూపొందించిన ఆత్మబంధువు అంబేద్కరుడు డాక్యుమెంటరీని సిఎం, ప్రకాశ్ అంబేద్కర్ తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు.

హాస్టల్ పిల్లలకు పిఎన్‌బి సాయం

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

హైదరాబాద్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా పేద విద్యార్థులకు సాయం చేసింది. జవహర్ నగర్‌లోని ఎస్‌సి, ఎస్‌టి బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు స్టడీ టేబుళ్లు, స్టడీ కుర్చీలు అందజేసింది. పిఎన్‌బి, హైదరాబాద్, సికింద్రాబాద్ సర్కిళ్ల పిఎన్‌బి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నగరంలోని ఎఫ్‌టిసిసిఐలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఎన్‌బి హైదరాబాద్ జోనల్ మేనేజర్ మహ్మద్ మక్సూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్కిల్ హెడ్ ఎన్‌విఎస్‌పి రెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ బివి నరేష్, ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం శివ మోహన్, ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కెవి రమణ మూర్తి, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ జోనల్ సెక్రటరీ జి వెంకన్న తదితరులు హాజరయ్యారు.



ఎంజి మోటార్ ఇవి 'కోమెట్' తయారీ ప్రారంభం

హైదరాబాద్ : ఎంజి మోటార్ ఇండియా తన స్మార్ట్ ఇవి అయిన 'కోమెట్' ఉత్పత్తిని ప్రారంభించినట్లు తెలిపింది. గుజరాత్‌లోని హలోల్ ప్లాంట్‌లో దీన్ని తయారీ ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొంది. ప్రపంచ మార్కెట్‌లో ఇప్పటి వరకు 10 లక్షల యూనిట్ల అమ్మకాలను నమోదు చేసినట్లు తెలిపింది. "భారత్‌లో ఎంజి కోమెట్‌తో ఆచరణాత్మక అర్బన్ విద్యుత్ వాహనాన్ని అందజేస్తాము. ఉత్పాదనా శ్రేణీలో బయటికి వస్తున్న మొదటి కోమెట్‌తో మేము దేశానికి ఒక కొత్త విద్యుత్ వాహన భవిష్యత్తు ప్రారంభానికి స్వాగతం పలకడానికి సంతోషంగా ఉన్నాము." అని ఎంజి మోటార్ ఇండియా ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజూ బాలేంద్రన్ పేర్కొన్నారు.



'దళితబంధు' దేశానికే ఆదర్శం

- మాజీ ఎంపి ప్రకాష్ అంబేద్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సిఎం కెసిఆర్ దళితబంధు పథకం అమలు చేయడం హర్షనీయమని, ఈ పథకం దేశానికే ఆదర్శమని మాజీ ఎంపి, బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో దళితబంధు కార్యక్రమం అమలు తీరును ఆయన శుక్రవారం పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. దళితబంధుకంటే ముందు ఒకరి కింద పాలేరుగాను, డ్రైవర్‌గాను పనిచేసిన వారు నేడు యజమానులుగా మారిపోయారన్నారు. ఇలాంటి పథకాలను మరిన్ని అమలు చేస్తే సమాజానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. దళితబంధు పథకం రాష్ట్రంలో సరికొత్త ప్రయోగమని తెలిపారు. చదువుతోపాటు ఉపాధి కల్పించే పథకాలు అమలు చేస్తే దళితుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 70 ఏండ్లుగా దేశంలో దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 30 శాతం మంది బలహీన వర్గాలకు చెందిన వారిని కూడా దళితబంధు స్కీములో చేర్చాలని కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, కలెక్టర్ ఆర్‌వి కర్ణన్, సిపి సుబ్బారాయుడు, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, జడ్‌పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, ఎంపిపి మమత ప్రసాద్, తహసీల్దార్ బండి రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలతో డిజిపి అంజనీకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం సమీపిస్తున్నందున శాంతి భద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా ఉండాలని డిజిపి అంజనీ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అతిపెద్ద చారిత్రక 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పోలీసు కమిషనర్లు (సీపీ), ఎస్‌పిలతో హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ డీజీలు మహేష్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, శిఖా గోయల్, సందీప్ శాండిల్య, రాచకొండ సీపీ డిఎస్ చౌహాన్, ఐజీలు కమలహాసన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ కాసీం, డీఐజీ రమేష్ రెడ్డి తదితర సీనియర్ పోలీస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజనీ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్రంలో వివిధ రాజకీయ పక్షాలు, సంస్థలు పాదయాత్రలు, బహిరంగ సభలు అధికంగా నిర్వహిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల విభాగం, స్పెషల్ బ్రాంచ్‌ల పనితీరు అత్యంత కీలకమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో బందోబస్తు ఒక పరీక్షగా ఉంటుందని, ప్రతిసారి ఎదురయ్యే కొత్త సవాళ్లకు అనుగుణంగా సరికొత్త వ్యూహంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రానికి ఉన్న సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లకు చెందిన సరిహద్దు జిల్లాలపట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా తీవ్రవాద పార్టీల సానుభూతిపరులు, మాజీలు, మిలిటెంట్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సామాన్య ప్రజలు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో పోలీస్ సిబ్బంది, అధికారుల ప్రవర్తన మర్యాదపూర్వకంగా ఉండాలని స్పష్టం చేశారు.

రూ.10 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం : హయర్

న్యూఢిల్లీ : గృహోపకరణాల రంగంలోని హయర్ 2024 చివరి నాటికి రూ.10వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ముగింపు నాటికి అన్ని గృహోపకరణాలు, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్‌లో వన్ స్టాప్ సొల్యూషన్‌గా నిలువాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. ఆదాయ ఆర్జనలో 2023లో 40 శాతం, 2024లో 30 శాతం చొప్పున వృద్ధిని అంచనా వేస్తున్నామని హయర్ ఇండియా ప్రెసిడెంట్ సతీష్ ఎన్‌ఎస్ పేర్కొన్నారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న ఐఒటి, డిజిటల్ అభిరుచులపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నామన్నారు.

అంబేద్కర్‌కు ఎస్‌బిఐ ఉద్యోగుల నివాళి

హైదరాబాద్ : భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని ఎస్‌బిఐ ఉద్యోగులు గొప్పగా నిర్వహించారు. ఎస్‌బిఐ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సెవా) ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ట్యాంక్‌బండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా సిజిఎం అమిత్ జింగ్రాన్, ఉన్నతాధికారులు మంజూ శర్మ, దేబాశిశ్ మిశ్రా, జితేంద్ర శర్మ, డిజిఎం, సిడిఒ, ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు. సెవా ప్రెసిడెంట్ డి సూర్యం, జనరల్ సెక్రటరీ వి భార్గవ్ కుమార్, ఆ సంస్థ ప్రతినిధులు ఎస్ అప్ప స్వామి, ఎ సాయి ప్రసాద్‌లు, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై ఘన నివాళ్లు అర్పించారు.

అత్తాపూర్‌లో హెగ్డే ఫెర్టిలిటీ ప్రారంభం

హైదరాబాద్ : ఐవిఎఫ్, అధునాతన సంతానసాఫల్య చికిత్సలను అందిస్తున్న సంతాన సాఫల్య గొలుసుకట్టు సంస్థ హెగ్డే ఫెర్టిలిటీ కొత్తగా నగరంలోని అత్తాపూర్‌లో తన నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇది తమ సంస్థకు ఐదవ కేంద్రమని ఆ సంస్థ చీఫ్ ఐవిఎఫ్, కన్సల్టెంట్ డాక్టర్ వందనా హెగ్డే తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి రాజేంద్రనగర్ ఎంఎల్ఎ టి.ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ మోంద్ర సంగీత, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, క్లినికల్ హెడ్ డాక్టర్ షాలిని సింగ్‌లు హాజరయ్యారు. తమ సంస్థకు మాదాపూర్, మియాపూర్, మలక్‌పేట్, సుచిత్రలో కేంద్రాలు ఉన్నాయని వందనా హెగ్డే తెలిపారు.

బిఆర్ఎస్‌కు జై కొడుతున్న ఔరంగాబాద్

గులాబీ గూటికి వివిధ పార్టీల కీలక నేతలు : ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్‌లో చేరడానికి వివిధ పార్టీల నేతలు వస్తున్నారని పియుసి చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి తెలిపారు. ఔరంగాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీల కీలక నేతలు గులాబీ గూటికి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బిఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఔరంగాబాద్ తాలుకా ప్రెసిడెంట్ నితిశ్‌రాథోడ్, బంజారా బ్రిగేడ్ జిల్లా అధ్యక్షుడు చత్రపతి మఖేష్‌రాథోడ్, బంజారా బ్రిగేడ్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్‌రాథోడ్, లల్లూరాథోడ్, వినోద్‌చౌహాన్, సందీఒ రాథోడ్, ప్రేమ్‌దాస్ రాథోడ్ తదితరులు కూడా బిఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. మహరాష్ట్ర జయ సంఘర్ష్ వెహికిల్ డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ హల్నర్, వైస్ ప్రెసిడెంట్ అబ్బాస్‌ఖాన్, కమిటి సభ్యులు రమేష్ కోల్తే, రవింద్ర షడ్కే, సోమనాథ్ గైక్వాడ్, రవింద్ర అడావ్, జ్ఞానేశ్వర్ హల్నర్ తదితరులు చేరారు. ఇంకా మానోహిత్ లోక్షై పక్ష్ పార్టీ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కష్ణ గైక్వాడ్ కూడా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మోడల్ తమ రాష్ట్రంలోనూ అమలు కావాలంటే బిఆర్ఎస్‌తోనే సాధ్యమని మహారాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మెన్ వేణు గోపాలచారి, ఔరంగాబాద్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు హర్షవర్ధన్ జాదవ్, అభయ్‌పాటిల్, ఖదీర్ మలనా, దిలీప్ గోరే, అంకిత్ యాదవ్, శివాంజ్ యాదవ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

రేపు యుకె ఎడ్యుకేషన్ ఫెయిర్

హైదరాబాద్ : భారతీయ విద్యార్థుల కోసం ప్రముఖ బ్రిటన్ యూనివర్శిటీలతో భాగస్వామ్యం ద్వారా యుకె ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ-యుకె సంస్థ తెలిపింది. ఏప్రిల్ 16న హైదరాబాద్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో ఉదయం 11 నుంచి 4 గంటల వరకు ఈ ఫెయిర్ ఉంటుందని పేర్కొంది. బ్రిటన్‌లో చదువుకోవాలనే వారికి, వారి తల్లిదండ్రులు కూడా సమగ్రమైన వివరాలు పొందవచ్చని తెలిపింది. ఈ ఫెయిర్‌లో యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్, యునివర్శిటీ ఆఫ్ బర్మింగ్ హామ్, క్వీన్స్ యూనివర్శిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్శిటీ ఆఫ్ ఎక్టెర్ భాగస్వామ్యం అవుతాయని పేర్కొంది.

ఉద్యోగ అభద్రతలో 71 శాతం మంది



న్యూఢిల్లీ : దాదాపు మూడువంతుల మందిలో ఉద్యోగ అభద్రత నెలకొంది. హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయినా జీనియస్ కన్సల్టెంట్స్ సర్వే ప్రకారం... ఉద్యోగ భద్రతపై 71 శాతం మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీలు పొదుపు చర్యలను పాటించడం ద్వారానే తొలగింపులకు పాల్పడుతున్నాయని 30 శాతం మంది పేర్కొన్నారు. ఆర్థిక మాంద్యాన్ని బూచిగా చూపి ఉద్వాసనలు పలుకుతున్నాయని మరో 23 శాతం మంది అభిప్రాయపడ్డారు. అధిక నియామకాలు కూడా తీసివేతలకు కారణమని మరో 36 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఫైనాన్స్, ఇంజనీరింగ్, ఇ-ఎడ్యుకేషన్, ఎఫ్‌ఎంసిజి, హాస్పిటాలిటీ తదితర అన్ని రంగాల్లోని 1,537 మందిని ఈ సర్వేలో భాగస్వామ్యం చేసినట్లు జీనియస్ కన్సల్టెంట్స్ తెలిపింది. "అందుబాటులో ఉన్న మానవ వనరులతో తమ శ్రామిక శక్తిని సమతుల్యం చేసుకోవడానికి కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. అనేక సంస్థలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఖర్చులను తగ్గించడం ద్వారా తమ లాభదాయకతను మెరుగుపరచుకోవాలని భావిస్తున్నాయి. సాంకేతిక పురోగతి, భౌతిక లేబర్‌పై తక్కువ ఆధారపడటం ద్వారా తొలగింపులు చోటు చేసుకుంటున్నాయని 11 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రస్తుత తొలగింపుల నేపథ్యంలో తమ సంస్థలో ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నట్లు 57 శాతం మంది పేర్కొంది. అనిశ్చితిని నివారించడానికి ఉద్యోగులను మార్చుకోవాలని కంపెనీలు భావిస్తున్నాయని 83 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ గందరగోళం నుంచి బయటపడటానికి సొంత వ్యాపారాన్ని పెట్టుకోవాలని భావిస్తున్నామని 5 శాతం మంది పేర్కొన్నారు." అని ఈ రిపోర్ట్ పేర్కొంది. "ప్రస్తుత తొలగింపుల ప్రక్రియలు ఉద్యోగులలో చాలా ఆందోళనలు కలిగిస్తోందని స్పష్టమవుతోంది. అటువంటి పరిస్థితులను నివారించడానికి సంస్థలు మెరుగైన శ్రామిక శక్తి ప్రణాళిక, నిర్వహణ వ్యూహాలు, అలాగే తమ ఉద్యోగులతో మంచి సంబంధాలు, పారదర్శకతను కలిగి ఉండాలి." అని జీనియస్ కన్సల్టెంట్స్ సిఎండి ఆర్‌పి యాదవ్ తెలిపారు.

ఎగుమతుల్లో 14 శాతం పతనం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది మార్చిలో భారత ఉత్పత్తుల ఎగుమతులు 13.9 శాతం పతనమై 38.38 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆర్థిక అనిశ్చితికి తోడు భారత సరుకులు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు, నాణ్యతపరంగా పోటీ పడలేకపోతున్నాయని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. గడిచిన నెలలో దిగుమతులు 7.9 శాతం తగ్గి 58.11 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. 2022 ఇదే మార్చిలో భారత ఎగుమతులు 44.57 బిలియన్ డాలర్లుగా, దిగుమతులు 63 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. గడిచిన మార్చిలో భారత వాణిజ్య లోటు 19.73 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2022-23లో స్థూల వాణిజ్యలోటు 122 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుందని ప్రభుత్వ గణంకాలు తెలిపాయి. 2021-22లో ఇది 85.53 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 723/2022

బిట్వీన్:
Chinnam Hema Chandra Prasad ...వాది
ఎదిరి
Chinnam Hari Gopal and Others ...పతివాదులు

To,
D3. Padavala Umadevi, W/o Uma sankar,
D.No.6-1-285/7, Padma Rao Nagar,
Hyderabad-500025.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.02-05-2023వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా:02-05-2023

పొన్నం విజయ్ కుమార్,
వాది తరపు అడ్వకేట్,
తెనాలి, సెల్.నెం.8096870310

IN THE COURT OF THE MVACT CUM X TH ADDL CHIEF JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD
M.V.O.P.No. : 1147 of 2021

Between:
S Kumara Swamy ...Petitioner
AND
M Bhaskaraiah and others ...Respondents

To,
M Bhaskaraiah, S/o. M Ramchandraiah, age : Major, Occ : Business, R/o: Plot no. 35, Near MSR Hostel, Venkatramana Colony, Dilsukhnagar Hyderabad.

Please take notice that the Petitioner had filed the above case for grant of compensation for the Injuries sustained in a motor vehicle accident which occurred on 18-02-2021 under the limits of P.S. Nacharam.

The above case is posted to 02-05-2023 at 10-30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K.ANAND REDDY
D.VENKAT RAMANA
ADVOCATES
Counsels for the Petitioners
Office: Flat No. 212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell : 9848052455, 9848051707

IN THE COURT OF THE VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4320 of 2021

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)& Authorized Officer, ...Plaintiff
And
Sri.V.Gowtham ...Defendant

To
Sri.V.Gowtham, S/o.Ramesh, Aged about 33 Years, Occ: Business, R/o. H.No.2-2-644/1/B, Baghamberpet, Hyderabad, T.S-500080.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,20,793-20ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 28-04-2023.

In case of your failure to attend before the Court on 28-04-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1661 of 2022

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager&Authorized Officer, ...Plaintiff
And
Sri.P.Ravi Teja, ...Defendant

To
Sri.P.Ravi Teja, S/o.P.Manikyam, Aged about 33Years, Occ: Labour Cntractor, R/o.H.No.2-70, Fasalwadi Village, Sangareddy Mandal, Sangareddy District, T.S-502294.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.3,36,080-56ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 27-04-2023.

In case of your failure to attend before the Court on 27-04-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE HONOURABLE XVII SENIOUR CIVIL JUDGE CITY COURT, AT HYDERABAD
I.A.No. 398 OF 2023 in O.S.No 97 OF 2013

Between:
1. Lalitha Bai widow of Late. Ramchander Singh, Aged about: 60 years, Occ: household,
2. Mukesh Singh S/o late. Ramchander Singh, Aged about:49 years, Occ: Nil,
3. Bajrang Singh s/o late. Ramchander Singh, Aged about:39 years, Occ: Nil,

(All Petitioners are R/o 12-1-630/3, Asifnagar, Hyderabad-28) ...Petitioners/Plaintiffs

And
1.A.Mallesh S/o A. Buchappa, Aged about: 48 years, Occ: business, Tenant at # 12-1-630/3, Asifnagar, Hyd. (died per Lrs.) ...Defendant(died per Lrs.,)

NOTICE

To,
2. A. Jaya w/o late. A. Mallesh, Aged about:34 years, Occ: household R/o H.No.11-1-889/5/2, Sitarambagh, Afzalsagar, Hyderabad, T.S., ...Respondent/Defendant
(Propose party as Defendant No.2)

As per the orders in **I.A.No.398/2023 dt.03.04.2023** of the above Honourable Court, it is to inform You i.e the 2. A. Jaya w/o late. A. Mallesh, Aged about:34 years, Occ: household, R/o H.no.11-1-889/5/2, Sitarambagh, Afzalsagar, Hyderaad, T.S., (Propose Party as Defendant No.2 in the above suit) as such you are the wife of deceased A.Mallesh who was the Defendant in the above suit in respect of "Suit Schedule Property" hence, it is to inform you to appear before the honourable court on 18th april, 2023 at 10:30 AM, in person or with your Advocate, in failure appropriate orders will be passed by the Honourable Court in the above suit.

Hence, this Notice.

Dt. .04. 2023
Hyderabad

Counsel for Plaintiffs
Sri sudheer Singh Advocate
12-1-630/4/1/, Asifnagar, Hyderabad, Telangana State.

రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ పరిరక్షణ కోసం జరిపే పోరాటమే బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న విగ్రహానికి చెరుపల్లి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటం చేయకుంటే పాలకవర్గాలు ఈ రాజ్యాంగాన్ని నిలబడనీయవంటూ రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. దాన్నికాపాడుకునేందుకు కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, మేధావులు, వివిధ సామాజిక తరగతులు, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులందరూ కలిసికట్టుగా బిజెపి కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని కోరారు. తద్వారా మోడీ సర్కార్‌ను గద్దె దింపాలని కోరారు.

లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజం దేశానికి మూలస్థంభాలన్నారు. వాటిని కాదని, కేంద్రంలోని బిజెపి సర్కారు ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతం ఆధారంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ విధానాన్ని అమలు చేస్తున్నదని విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమాన్ని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్నే కాకుండా మొత్తం భారతదేశ చరిత్రనే వక్రీకరిస్తున్నదని విమర్శించారు.

అంబేద్కర్‌కు నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి.సాగర్, జాన్ వెస్లీ, ఎం.వీ.రమణ, నంద్యాల నర్సింహారెడ్డి, శ్రీరాంనాయక్, సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వెంకట్రాములు, టిపిఎస్‌కె రాష్ట్ర నాయకులు జి.రాములు తదితరులు ఉన్నారు.

'బలగం' మొగిలయ్యకు మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బలగం సినిమా గాయకులు మొగిలయ్యను రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తున్నదనీ, మంచి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. వైద్యులను అడిగి మొగిలయ్య ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

క్రీడలు మానసిక వికాసానికి ప్రతీకలు

- క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రీడలు మానసిక వికాసానికి ప్రతీకలనీ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి డ్రాప్ రో బాల్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పథకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో సత్కరించి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర డ్రాప్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. అండర్ - 15 సబ్ జూనియర్ బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా చండూరు గాంధీజీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న రుక్సర్ ఉన్నిసా బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నది. అండర్ -15 బాలుర విభాగంలో అదే పాఠశాలకు చెందిన ఎమ్‌డీ సైఫ్ రజతం పతకాన్ని సాధించాడు. అండర్ -21 యూత్ బాలుర విభాగంలో చండూరుకు చెందిన ఈ. తరుణ్, నాంపల్లికి చెందిన డి. అరుణ్‌లు రజత పతకాన్ని సాధించారు. అభినందన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డ్రాప్ రో బాల్ కార్యదర్శి ఎమ్‌డీ రహమత్, డ్రాప్ రోబాల్ టెక్నికల్ అబ్జర్వర్ ఎమ్‌డీ అక్బర్ బాబా, పి. గణేష్, బి.నవీన్, బి. సాయిరాం, బి.లక్ష్మణ్, కే. శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ పోరాటం ఆగదు

- రాష్ట్ర వ్యాప్తంగా 50 కేంద్రాల్లో పేదల గుడిసెలు
- జగిత్యాల జైత్రయాత్రలా కోరుట్ల భూపోరాటాన్ని సాగిస్తాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నిలువ నీడ కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే పేదలు ఇంటిజాగల కోసం పోరాడుతున్నారు. లంచాలు ఇచ్చి రహస్యంగా గుడిసెలు వేసుకోవడం లేదు. తమ హక్కుగానే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటున్నారు. రూ.కోట్ల విలువజేసే వందలాది ఎకరాలు కబ్జా చేస్తున్న నాయకులు, అక్రమార్కుల జోలికి రెవెన్యూ, పోలీసు అధికారులు పోవడం లేదు.. వారి నుంచి ప్రభుత్వ ఆస్తులు కాపాడకుండా రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలపైనే జులుం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 కేంద్రాల్లో వేలాది మంది సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగదు' అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ భూమిలో గెడిసెలు వేసుకుని ఐదు రోజులుగా పోరాడుతున్న పేదలను, వారికి అండగా నిలిచి అరెస్టయిన సిపిఎం జిల్లా నాయకత్వాన్ని శుక్రవారం వారు పరామర్శించారు. వేసిన గుడిసెలు తగలబెట్టిన చోటనే పేదలతో కలిసి అంబేద్కర్ 132జయంతిని నిర్వహించారు.

ఈ సందర్భంగా జి.నాగయ, ఎస్.వీరయ్య మాట్లాడారు. ఎర్రజెండా పోరాటాల్లో లాఠీదెబ్బలు, అరెస్టులు, జైళ్లు, పీడీయాక్టులు కొత్తేమీ కాదని, నిరంతరం పేదల పక్షాన వారి హక్కుల రక్షణకు కవచంగా ఎర్రజెండా పనిచేస్తుందని చెప్పారు. ఈ పోరాటంలో ఎన్నో ఒడిదొడుకులు, కష్టనష్టాలు వస్తాయని, వాటన్నింటినీ ఎదిరిస్తేనే ఉండేందుకు కాస్త ఇంటి స్థలం వస్తుందని పేదలకు సూచించారు. వరంగల్ జిల్లా నడిబొడ్డున జక్కలొద్దిలో పేదల పక్షాన సిపిఎం భూపోరాటం చేసి విజయం సాధించిన విషయాన్ని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(ఏ) పేదలకు బతికే హక్కు ఉందని చెబుతోందని, అంటే వారికి ఇల్లు ఉండాలని ఢిల్లీ హైకోర్టు తీర్పు కూడా ఇచ్చిందని తెలిపారు. అదే రాజ్యాంగంలోని 32 (2) అధికరణం ప్రకారం.. సమాజంలో అసమానతలు ఉండొద్దని, కనీస హక్కులు ప్రతి ఒక్కరికీ కల్పించాలని చెబుతోందన్నారు. దాని స్ఫూర్తితోనే నిలువనీడలేని పేదల కోసం ఈ భూపోరాటాన్ని సాగిస్తున్నామని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లల బాలకృష్ణ మాట్లాడుతూ.. కోరుట్ల మద్దూర్ చెరువులోని వందల ఎకరాలను కొందరు నేతలు, సంపన్నవర్గాలు కబ్జాచేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, జిల్లా కమిటీ సభ్యులు సులోచన, సీనియర్ నాయకులు సారంగపాణి, వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితోనే భూపోరాటం : జయలక్ష్మి

ప్రజలకు సామాజిక, ఆర్థిక అసమానతలు లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించాలని అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తితోనే భూపోరాటం చేస్తున్నామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి అన్నారు. సిపిఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలో సాగుతున్న భూపోరాటంలో ఆమె మాట్లాడారు. 28 రోజులుగా ఎర్రటి ఎండను లెక్కచేయకుండా సాగిస్తున్న భూపోరాటం నాయకులకు కనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. సిపిఎం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సీనియర్ నాయకులు నరివిట్ల నరసన్న పాల్గొన్నారు.



నూతన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కెటిఆర్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ పంజగుట్ట కూడలిలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని కెటిఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెసిఆర్ అమలు చేస్తున్న దళితబంధు.. సాహసోపేతమైన పథకమని కొనియాడారు. కొత్త పార్లమెంట్‌కు కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. పంజాగుట్ట కూడలికి అంబేద్కర్ పేరు పెడతామని కెటిఆర్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు అంబేద్కర్

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని శుక్రవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు.

అంబేద్కర్ చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సామాజిక వారోత్సవాలను ఏప్రిల్ 6 బిటిఆర్ వర్ధంతితో ప్రారంభమై ఏప్రిల్ 14తో ముగిశాయని తెలిపారు. సామాజిక సమస్యలపైన అధ్యయనం, సర్వేలు, సామాజిక సంఘీభావ నిధిని కార్మికుల నుంచి సేకరించామన్నారు. అంబేద్కర్ విశ్వమానవుడు, సామాజిక విప్లవకారుడు అని కొనియాడారు. మనుస్మృతిని అంతం చేయకుండా కుల వివక్ష, నిర్మూలన సాధ్యం కాదని ఆనాడే అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మనుస్మృతిని తీసుకొచ్చే ప్రయత్నం వేగమైందన్నారు. ఇప్పటికీ బిజెపి పాలిత రాష్ట్రాలలో రెండు గ్లాసుల పద్ధతి అమల్లో ఉందని తెలిపారు. దళిత స్త్రీలపైనా, యువకులపైనా మతోన్మాద దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అంబేద్కర్ విగ్రహాలను కోరుకోలేదనీ, ప్రభుత్వ భూములు, సంస్థలు ప్రయివేటీకరించొద్దని కోరుకున్నారని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, పి. శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న పి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనం

- ప్రత్యేక జాతీయ విధానం అమలుకు ఎన్‌డిఎ యత్నం
- అంబేద్కర్ జయంతి సందర్భంగా సెమినార్‌లో ఐవి రమణారావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ సారాన్ని క్రమేణా దెబ్బతీస్తోంది. ప్రత్యేక జాతీయ విధానం అమలుకు యత్నిస్తోంది. మోడీ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీన పడుతున్నాయి" అని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఐవీ రమణారావు ఆందోళన వ్యక్తం చేశారు.

అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఖమ్మంలో బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే), జన విజ్ఞాన వేదిక (జేవీవీ), తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పిఏ) ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం- సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీ రమణారావు మాట్లాడారు. ఎక్కడ అంబేద్కర్ నుంచి దూరంగా జరుగుతామో అక్కడ భారీ విగ్రహాలు వెలుస్తాయని అన్నారు. ఏదో ఒక రోజు రాజ్యాంగాన్ని మీరే వదులుకోవాల్సి వస్తుందేమో..! అన్న అంబేద్కర్ మాటలు ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడుతున్నాయని, 2014 తర్వాత ప్రజాస్వామ్యం చిన్న భిన్నమైందని అన్నారు. ప్రతిపక్షాలు, న్యాయవ్యవస్థ, ప్రభుత్వ నిఘా సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని వాపోయారు.

రాజకీయ పార్టీల విదేశీ మూల నిధుల్లో ప్రపంచంలోనే అతి సంపన్నమైన పార్టీగా బిజెపి అవతరించిందన్నారు. అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి బహుళ ఎన్నికల విధానాన్ని ఎత్తివేసేందుకు యత్నిస్తోందని తెలిపారు. రాజ్యసభ అధికారాలను కుదించి వేసిందని, 2014లో అధికారంలోకి రాగానే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్న వారిని గవర్నర్లుగా నియమించిందని చెప్పారు. చివరికి ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు ఉండే సుప్రీంకోర్టు కొలోజియంనూ నిర్వీర్యం చేయాలనే కుట్రలు కొనసాగుతున్నాయన్నారు. రైట్ టు ఇన్‌ఫర్మేషన్ యాక్ట్ సైతం నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సార్వభౌమాధికారం ప్రజల చేతుల్లో నుంచి చేజారుతోందని ఖమ్మం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికతత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తించాలన్నారు. బీవీకే జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో అంబేద్కర్ నాటక రచయిత దేవేంద్ర సైతం ఉపన్యసించారు.

బావిలో పడి తండ్రీకొడుకు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందారు. ఎస్ఐ నీరేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మడావి సోనేరావ్(52) పొలంలో బావి తవ్వించాడు. ఈ క్రమంలో తమ సంప్రదాయాల ప్రకారం పూజలు చేయడానికి కొడుకు మడావి సూర్యబాన్(21), కూతురు మడావి శైలజతో కలిసి శుక్రవారం ఉదయం పొలానికెళ్లారు. పూజలు చేస్తుండగా సోనేరావ్ బావిలో నుంచి చెంబుతో నీరు తీసుకొస్తుండగా.. కాలు జారి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. తండ్రిని కాపాడటానికి కొడుకు బావిలోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో మునిగిపోయారు. ఒడ్డు మీద ఉన్న కూతురు కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు చెప్పింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే బావి వద్దకు వెళ్లారు. పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్ఐ నీరేష్ తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి, ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు.

దేశానికి సేవలందించిన మహానేత అంబేద్కర్

- ఎఐకెఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి ఎనలేని సేవలందించిన మహానేత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎఐకెఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి కొనియాడారు. పేదరికంతో సంబంధం లేకుండా ఉన్నత విద్యను అభ్యసించి భారత రాజ్యాంగాన్ని రచించి ఈ దేశానికి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారంపల్లి మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై బిఆర్ఎస్, ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నో కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్టును ఎత్తేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదాన్ని అమలు చేసేందుకు, రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. అలాంటి బిజెపి కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మిక, మహిళా చట్టాలను తొలగించేందుకు కూడా పావులు కదుపుతున్నాయని విమర్శించారు. పేద ప్రజలకు సేలందిస్తున్న రైల్వే రక్షణ రంగాలు, బీఎస్ఎన్ఎల్, విమానాశ్రయాలు, పోస్టు ఆఫీసులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, పద్మ, కిషోర్, ఆర్.ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.



దేశ స్వాతంత్ర్యం బిజెపి సంకెళ్లలో బంధీ

- విడిపించాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందే..
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే
- 2024లో అధికారం కాంగ్రెస్‌దే : రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ స్వాతంత్ర్యం బిజెపి సంకెళ్లలో బంధించబడిందని, దీన్ని విడిపించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ పని చేయడం కాంగ్రెస్ తప్ప ఎవరితోనూ సాధ్యం కాదన్నారు. జోడో యాత్రకు కొనసాగింపుగా సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా శుక్రవారం మంచిర్యాలలో బహిరంగ సభ నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. తొలుత అంబేద్కర్, మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహాలకు ఖర్గే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభనుద్దేశించి మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశ చూపించారని తెలిపారు. అన్ని వర్గాలకు సమానహక్కులు కల్పించారని, ఆయనే లేకపోతే ఎస్‌సిలు, మహిళలకు ఓటు హక్కు వచ్చేది కాదని చెప్పారు. అధికారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోడీ నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు. సింగరేణిలోనూ గణనీయంగా ఉద్యోగాల సంఖ్యను తగ్గించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీపై రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అనర్హత వేటు వేసి రెండేండ్ల జైలు శిక్ష విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, పేదలకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణహిత- చేవెళ్లకు అంబేద్కర్ పేరు పెడితే.. ముఖ్యమంత్రి కెసిఆర్ ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. తొమ్మిదిన్నర ఏండ్లలో ఒక్కసారి కూడా అంబేద్కర్‌కు కనీసం పూలమాల వేయలేదని, ఇప్పుడు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి కాళ్లు పట్టుకోవడం దళితుల ఓట్ల కోసమేనని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.500కే సిలిండర్ అందజేస్తామని, ఆరోగ్యశ్రీలో రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను కాంగ్రెస్ దత్తత తీసుకుంటుందన్నారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను తాము అధికారంలోకి రాగానే పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, బోసురాజు, కొప్పుల రాజు, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, పోదెం వీరయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దామోదర రాజనర్సింహ, మధుయాష్కిగౌడ్, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్‌అలీ, మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజ్యాంగానికి బిజెపి యత్నం

- మనువాదాన్ని చొప్పించే కుట్ర : ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు తిలోదకాలు ఇచ్చి దేశంలో ప్రత్యామ్నాయ రాజ్యాంగ ఏర్పాటుకు ఎన్‌డిఎ ప్రభుత్వం యత్నిస్తోందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని ముందుకు తెచ్చే కుట్ర జరుగుతోందని చెప్పారు. ప్రతీకార విప్లవంలో భాగంగా రాజ్యాంగ సంస్థలు విలువల విధ్వంసం ముందుకు వస్తోందన్నారు. ప్రత్యామ్నాయ పౌర సమూహం (సిసిఎ) ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం 'రాజ్యాంగ సంస్థల విధ్వంసం' అంశంపై నిర్వహించిన సదస్సులో హరగోపాల్ మాట్లాడారు. అసమానతలు, అంతరాలు రూపుమాపి ఉన్నత మానవతా విలువలను క్రోడీకరించి నాడు అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందిస్తే నేటి బిజెపి ప్రభుత్వం ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు చూస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని చొప్పించే కుట్రలో భాగంగా ఈ యత్నానికి పాల్పడుతోందన్నారు. రాజ్యాంగంలోని సమున్నత మానవతా విలువలను హరించి వేసేందుకు పూనుకుందన్నారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రావాలంటే కుల వ్యవస్థ పోవాలని అంబేద్కర్ ఆశిస్తే.. దేశంలోని ఆధిపత్య శక్తులు కుల వ్యవస్థను వివిధ రూపాల్లో చొప్పించేందుకు యత్నిస్తున్నాయన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలు ప్రజాస్వామ్యం రాజ్యాంగ పరిరక్షణకు అవసరమని చెప్పారు. న్యాయవ్యవస్థ రాజ్యాంగం, రాజ్యాంగ విలువలను కాపాడటంలో సందిగ్ధంలో పడితే దేశం భవిష్యత్తు ఏంటి అని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద అందరికీ ప్రయోజనం చేకూర్చాలి, అసమానతలను రూపుమాపాలని అంబేద్కర్ ఆశిస్తే బీజేపీ ప్రభుత్వ విధానం అందుకు విరుద్ధంగా సాగుతుందని ఆర్థిక విశ్లేషకులు పాపారావు అన్నారు. 'ప్రభుత్వ ఆర్థిక విధానాలు - ప్రజా సంపద లూటీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్ పీజీ) విధానాలు బిజెపి భావజాలానికి లింకు బాగా కుదిరిందని చెప్పారు. సంక్షేమ రాజ్యాన్ని పీకేసి దాని స్థానంలో ఎల్పీజీ విధానాన్ని ముందుకు తీసుకొచ్చేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం దృష్టిసారించిందని తెలిపారు. దానిలో భాగంగానే కార్పొరేట్ యాక్షన్ తగ్గించారని, నగదు రద్దు, జిఎస్‌టిని ముందుకు తీసుకొచ్చారని వివరించారు. డాక్టర్ రెహనా బేగం సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త వనమాలి, సీసీఏ సభ్యులు డాక్టర్లు ఎంఎఫ్ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ కమ్యూనిస్టులే

- దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ
- బిజెపిని గద్దె దించాల్సిందే
- 'ఇంటింటికీ సిపిఐ' పాదయాత్ర ప్రారంభ సభలో వక్తలు
- సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో



పేదలకు అండగా ఉండేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే పేదలకు భూములు, ఇళ్లు దక్కుతున్నాయనీ, లేకుంటే పాలకులు వాటన్నింటినీ రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టేస్తారని చెప్పారు. ప్రజలందరిపై పన్నులు వేసి, కొందరు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ప్రజాధనాన్ని మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు 'బిజెపి హఠావో దేశ్ బచావో' నినాదంతో 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై ఇందిరాపార్కు వరకు పాదయాత్ర జరిగింది. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాదయాత్రను ప్రారంభించారు. ఇందిరాపార్కు వద్ద జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే రాష్ట్రాల్లో మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారనీ, కేంద్ర ప్రభుతాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు ప్రజల్లో చైతన్యం నింపాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. మోడీ ప్రభుత్వం అదానీకి ఇచ్చిన రాయితీల్లో పది శాతం ఖర్చు చేసినా పేద ప్రజానీకానికి ఇండ్లు నిర్మించి ఇవ్వచ్చన్నారు దేశంలో పేదరికం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ మోడీ కేంద్రంలో అధికారానికి రాకముందు చెప్పిన మాటలు, హామీలన్నింటినీ చెత్తకుప్పలో పడేశారనీ, పేదలపై పన్నుల భారాలు పెంచి, కార్పొరేట్ల కొమ్ముకాస్తున్నారని అన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాలకులు పేదలు, దళితులు, బలహీనవర్గాల పట్ల నిర్లక్ష్యం, వివక్ష చూపుతున్నారని చెప్పారు. వారికి కావల్సిన మౌలిక సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు ఈ కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించి, మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, దీనికి కారణం మోడీ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ మౌలిక సుత్రాలు ప్రమాదంలో పడ్డాయనీ, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తున్నాయనీ, సమస్యల పరిష్కారానికి కలిసి పోరాటం చేయాలని తెలిపారు. సిపిఐ చేపట్టిన 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమంలో సిపిఎం శ్రేణులు కూడా పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తాము ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటామన్నారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో కొత్తగూడెంలో లక్ష మందితో బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, వీఎస్ బోస్, జాతీయ సమితి సభ్యులు ఎమ్‌డీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.